రోడ్డు తవ్వారు.. వదిలేశారు

50 రోజులైనా పనులు ప్రారంభించని వైనం

● ప్రజలు, వాహనదారుల ఇబ్బంది ● సొంత డబ్బులతో పైపులైన్ నిర్మించుకున్న స్థానికులు

ముషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డును తవ్వి 50 రోజులు అయినా పునర్‌నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపం స్థానికులకు శాపంగా మారింది. తమ వద్ద డబ్బు లేదని, పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టలేమని జలమండలి అధికారులు అనడంతో స్థానికులే లక్ష రూపాయలు వెచ్చించి పైపులైన్ నిర్మించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రాంనగర్ నుంచి పార్సీగుట్ట వెళ్లే రోడ్డును ఫిబ్రవరి 18వ తేదీన తవ్వారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. దీంతో స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు అర కిలోమీటరు వరకు రోడ్డును తవ్వి కొత్తరోడ్డు వేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టడంతో స్థానికంగా కొన్ని ఇళ్లకు డ్రైనేజీ పైపులైన్ లేకపోవడంతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు జలమండలి అధికారులను కోరగా అనుమతి రాలేదని చెప్పారు.



తవ్వి వదిలేసిన రోడ్డు



డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి పొంగుతున్న మురుగు నీరు

లక్షరూపాయలు వెచ్చించి..

స్థానికంగా ఐదారు కుటుంబాలకు డ్రైనేజీ పైపులైన్ లేకపోవడంతో రోడ్డు తవ్వితే బండ రావడంతో దాన్ని పగులగొట్టి లక్ష రూపాయలు వెచ్చించి పైపులైన్ నిర్మించుకున్నారు.



స్థానికులు నిర్మించుకున్న డ్రైనేజీ పైపులైన్

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రజా ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రోడ్డును తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- నర్సింగ్ ప్రసాద్, స్థానికుడు

పైపులైన్ నిర్మాణానికి అనుమతి రాలేదు

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి అనుమతి రాలేదు. దీంతో స్థానికులే నిర్మించుకున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు 60 మీటర్ల మేర జలమండలి నిధులతో మ్యాన్‌హోల్స్ నిర్మించాం.

- శివసాయి, జలమండలి సెక్షన్ మేనేజర్

ఆస్తి పన్ను వసూలులో అంబర్‌పేట సర్కిల్ రికార్డు

● రూ. 62.10 కోట్లు వసూలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలులో అంబర్‌పేట సర్కిల్-16 రికార్డు నెలకొల్పింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను సర్కిల్ పరిధిలోని హిమాయత్‌నగర్, కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట డివిజన్లలో రూ. 53.65 కోట్లు ఆస్తిపన్ను వసూలు టార్గెట్ విధించగా రూ. 62.10 కోట్లు వసూలు చేశారు. గతంలో 90 శాతం కంటే ఎక్కువ వసూలు కాలేదు. ప్రస్తుతం మార్చి 31 వరకు 116 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. ఆస్తిపన్ను వసూళ్లలో రికార్డు నెలకొల్పినందుకు డీఎంసీ మారుతీ దివాకర్, సిబ్బందిని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అభినందించారు. డీఎంసీ మాట్లాడుతూ.. ఏప్రిల్ 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.



తోపుడు బండ్ల వ్యాపారులకు సూచనలిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి

నగరాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దుదాం

ముషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి పిలుపునిచ్చారు. మంగళవారం స్వచ్ఛత వైపు ఒక అడుగు పేరిట జీహెచ్‌ఎంసీ చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి ముషీరాబాద్, భోలక్‌పూర్, రాంనగర్ ప్రాంతాలలో పర్యటించారు. రోడ్లపై చెత్త వేయొద్దని, రిక్షా కార్మికులకు ఇవ్వాలని వ్యాపారులు, తోపుడుబండ్ల నిర్వాహకులకు సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జూన్ 2వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఫీల్డ్ ఆఫీసర్‌లు రమేష్, శేఖర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులు ముందుంటారని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో వాసవీ మహిళా సంఘం చిక్కడపల్లి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వాసవీ మహిళా సంఘం చిక్కడపల్లి అధ్యక్షురాలు శ్రీరాం విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మాలతి, కోశాధికారి వసంత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న సయ్యద్ ఇమామ్

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో సేవాభావం పెరిగి మానవతా విలువలు పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని హాజీ సయ్యద్ మదార్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఇమామ్ అన్నారు. మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్, నాంపల్లి, అడిక్‌మెట్, నారాయణగూడ తదితర ప్రాంతాలలో రంజాన్ కిట్లను పేద ముస్లింలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారుడు ఎం.నర్సయ్య, నాయకులు రసూల్, సలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి'

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ, బధిర ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డెవలప్‌మెంట్ ఆఫ్ సొసైటీ ఫర్ డెఫ్ (డీఎస్‌డీ) రాష్ట్ర కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్లు వి.భారతి, కె.వెంకటేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

'పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించండి'

కవాడిగూడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. జంగయ్య, చావ రవి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో సిబ్బందికి ఆహారం, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా సిబ్బంది ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు ఏకరూప వేతనం చెల్లించాలన్నారు.

'వ్యక్తిని ఉల్లాసంగా ఉంచేది సాంస్కృతిక రంగం'

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతికరంగం ప్రతి వ్యక్తిని ఉల్లాసంగా, నిత్యయవ్వనంగా ఉంచుతుందని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ఆత్మీయ పురస్కారాలను సామాజిక కార్యకర్త రాఘవరెడ్డికి, నటి రాగిణికి, వీణావాయిద్యనిపుణులు లక్ష్మీశ్రీనివాస్, గీతరచయిత మౌనశ్రీమల్లిక్, కళాకారుడు తిరుమలేశ్వరరావు, నాట్యగురువు నిర్మలవిశ్వేశ్వరరావుకు బహూకరించారు. కళాభిమాని గుదిబండి వెంకటరెడ్డి 83వ జన్మదిన వేడుకలు కూడా జరిగాయి. రమణాచారి ఈ సందర్భంగా వెంకటరెడ్డిని సత్కరించారు. రాఘవరెడ్డి రూ. 50 వేల చెక్కును రమణాచారి నిర్వహిస్తున్న ఆనందనిలయం ఆశ్రమానికి అందజేశారు. దక్షిణమధ్యరైల్వే పూర్వ జీఎం సి.రామకృష్ణ, రామరాజు శ్రీనివాస్‌రావు, కొండపాక కృష్ణమాచార్య, చిల్ల రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న దర్శనం శర్మ

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ చైర్మన్ కమలాకర్‌శర్మ మోసాలపై సీఐడీతో విచారణ జరిపించాలని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి బర్కత్‌పురలో దంతపల్లి చాంబర్స్‌లోని బ్రాహ్మణ హాల్‌లో కమలాకరశర్మ బాధితుల సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ్స్ వెల్ఫేర్ భవన్ వ్యవస్థాపక సీఈవో గిరిప్రసాద్ శర్మ, బ్రాహ్మణ సంఘాల నేతలు దర్శనం శర్మ, బసవరాజు శ్రీనివాసులు మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకతోపాటు ఉత్తర భారతంలో ఉన్న బ్రాహ్మణుల నుంచి భూముల కొనుగోలుకు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కమలాకరశర్మ రూ. 350 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. భూములు కొనుగోలు చేసి వచ్చే డబ్బుతో అధిక వడ్డీ చెల్లిస్తామని నమ్మించడంతో దాదాపు 4 వేల మంది బ్రాహ్మణులు అతడి వద్ద డబ్బు ఇన్వెస్ట్ చేశారని అన్నారు. ప్రస్తుతం కమలాకరశర్మ వేరే కేసులో జైలులో ఉన్నారని, దానిని సాకుగా చూపించి డబ్బు ఎగ్గొట్టేందుకు చూస్తున్నాడని అన్నారు. డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేసిందే ఆదే తరహాలో కమలాకరశర్మ బాధితులకు కూడా న్యాయం చేయాలని వారు కోరారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో కానిస్టేబుల్ వసూళ్లు

● ప్రభుత్వ ఉద్యోగులకు బెదిరింపులు
● అతడిసహా సహకరించిన టీవీ మెకానిక్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్లు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌ను, అతడికి సహకరిస్తున్న ఓ టీవీ మెకానిక్‌ను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్‌లు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్‌లో నివసిస్తున్న ఎ.మల్లేశ్ అలియాస్ మూర్తి(38) మహబూబ్‌నగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. కొద్దికాలం క్రితం నాగర్‌కర్నూల్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. తనకు పరిచయస్తుడైన చింతలకుంటకు చెందిన టీవీ మెకానిక్ రాపోలు అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (28)తో కలిసి సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తాడు. ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల వివరాలతో జాబితా తయారు చేశాడు. వారిని బెదిరించి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అనిల్ ఫోన్ ద్వారా వారిని బెదిరించేవాడు. పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రెజరర్‌గా విధులు నిర్వరిస్తున్న కొత్తపేటకు చెందిన కె.సుధీర్‌బాబుకు మార్చి 6న ఫోన్ చేశాడు. అవినీతికి పాల్పడుతున్నావని ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయని బెదిరించాడు. దాడి చేయకుండా ఉండాలంటే లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీని గురించి మాట్లాడేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏసీబీ కార్యాలయం రోడ్డు వద్దకు రావాలని చెప్పాడు.

తాను అవినీతికి పాల్పడలేదని, బెదిరిస్తున్న మల్లేష్‌పై చర్యలు తీసుకోవాలని సుధీర్ బాబు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించాడు. కాల్‌డేటా ఆధారంగా అనిల్, మల్లేష్‌పై నిఘా పెట్టారు. అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. ఏఆర్ కానిస్టేబుల్ మల్లేష్ సూత్రధారిగా తేలింది. దీంతో మల్లేష్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిదిమంది వద్ద డబ్బు వసూలు

నిందితులు మల్లేష్, అనిల్‌ను విచారించగా.. గతంలో ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి సుమారు రూ. 3.40 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప నుంచి రూ. లక్ష, డీఎస్పీ ఇమ్మానుయేల్ వద్ద రూ. 8 వేలు, ఆర్ఐ వీరేష్ నుంచి రూ. 65 వేలు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య నుంచి రూ. 5 వేలు, అనిల్, రామ్‌లాల్, సౌమిత్రి నుంచి రూ. 5 వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు.

బాలు మెచ్చిన గాయకుడు మధుబాపు



మధుబాపుకు అవార్డు అందజేస్తున్న వంశీరామరాజు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏకధాటిగా ఇరవైనాలుగు గంటలు పాటలు పాడి రికార్డు సృష్టించిన మధుబాపుశాస్త్రి ప్రఖ్యాత గాయకుడు బాలు మెచ్చిన గాయకుడు అని వంశీసంస్థల అధినేత వంశీరామరాజు ప్రశంసించారు. త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికలో మంగళవారం మనీషా ఆర్ట్స్ ఆధ్వర్యంలో మధుబాపుశాస్త్రికి శోభన్‌బాబు వంశీ మ్యూజిక్ అవార్డు ప్రదానసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీ రామరాజు మాట్లాడుతూ.. శోభన్‌బాబు సినిమాలలో పాటలను అద్భుతంగా గానం చేస్తున్న మధుబాపుశాస్త్రి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. సినీనిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ.. త్వరలో మధుబాపుకు దాసరి నారాయణరావు అవార్డు ఇస్తామని ప్రకటించారు. మధుబాపు మాట్లాడుతూ.. శోభన్‌బాబు, బాల సుబ్రహ్మణ్యం విగ్రహాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. సంగీత దర్శకుడు శ్రీధర్ ఆత్రేయ తదితరులు పాల్గొన్నారు. తొలుత మధుబాపు, శ్రీదేవి, రేవతి, శ్రీకాంత్, స్వప్న, సాయి సింధూర పాటలు పాడి శ్రోతలను అలరించారు.

పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణకాండకు వ్యతిరేకంగా 5న ప్రత్యేక ప్రార్థనలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ దేశం జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా ఈ నెల 5న ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ నేతలు వెల్లడించారు. గాజాలో శాంతి నెలకొల్పాలని, ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ చీఫ్ కన్వీనర్ సనావుల్లాఖాన్, కన్వీనర్ ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ప్రతినిధులు నయీమ్ ఉల్లాషరీఫ్, ఇలియాస్ చెమ్కి, మునీరుద్దీన్ ముజాయిద్, మహ్మద్ అఫ్జల్, అహ్మద్ షకీల్ మాట్లాడారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల 40 వేల మంది పాలస్తీనియన్లు చనిపోయారని, వీరిలో చిన్నారులు కూడా ఉన్నారన్నారు. ఇజ్రాయిల్‌కు భారత్ మద్దతు తెలపడం తగదన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఇజ్రాయిల్‌ను నిషేధించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5న రంజాన్ మాసం చివరి శుక్రవారం రాష్ట్రంలోని అన్ని మసీదుల్లో పాలస్తీనీయన్లకు అండగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతామని వారన్నారు.

'అయ్యో'మయం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా..ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరతారని ప్రచారం జరుగుతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం. ఈ సమయంలో పార్టీ మారతారని ప్రచారం జరగడంతో బీఆర్ఎస్‌లో ఉంటారా ? వెళ్తారా ? అని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

'బీజేపీకి అండగా నిలవాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అపార్ట్‌మెంట్ వాసులు బీజేపీకి అండగా నిలవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరొకసారి జి.కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంగళవారం బర్కత్‌పురలో అపార్ట్‌మెంట్ వాసులతో ఆమె సమావేశమై కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, నాయకులు కృష్ణకుమార్, క్షీరసాగర్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలి

నల్లకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట బుర్జుగల్లీలో గౌడ సంఘం వద్ద పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అని శ్లాఘించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

రాంనగర్: బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటానికి గానూ జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లిలో కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో పాపన్నగౌడ్ 314వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర: నింబోలిఅడ్డలో పాపన్నగౌడ్ చిత్రపటానికి బీజేపీ నాయకుడు సుభాష్‌పటేల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కవాడిగూడ: దోమలగూడలో జరిగిన పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎంపీ సీట్ల కేటాయింపులో మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. మాదిగలకు ఎంపీ టికెట్ల కేటాయింపులో అన్యాయంపై మంగళవారం బషీర్‌బాగ్‌లో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీలకు కేవలం మూడు సీట్లు రిజర్వ్ కాగా మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఎన్నికల్లో మాదిగల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమశేఖర్, నర్సయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి'

నల్లకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం మందులబస్తీ, రహ్మత్‌నగర్‌లో జరుగుతున్న పైపులైన్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, శ్రీకాంత్ చౌదరి, మహేష్‌యాదవ్, మహమ్మద్ అజార్ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సీతయ్య రౌడీషీటర్లను హెచ్చరించారు. చిక్కడపల్లి స్టేషన్ పరిధిలోగల రౌడీషీటర్లను మంగళవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

సోదరిని దుర్భాషలాడిన వ్యక్తికి జైలు శిక్ష

ఆస్తి తగాదాల విషయంలో సోదరిని దుర్భాషలాడిన సోదరుడికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పి.శ్రీనివాస్ అనే వ్యక్తి చిక్కడపల్లిలో తన సోదరి ఇంటికి వచ్చి ఆస్తి విషయమై గొడవపడి ఆమెను దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి 15వ స్పెషల్ ఎంఎం కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారించిన న్యాయాధికారి శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ కేసులో మైనర్‌కు రెండేళ్లు..

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం దొంగతనం కేసులో మైనర్ బాలుడికి న్యాయస్థానం రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. కాచిగూడ పీఎస్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది డిసెంబర్ 4వ తేదీన చప్పల్ బజార్ వద్ద హోండా యాక్టివాను ఓ బాలుడు దొంగిలించాడు. వాహన యజమాని టి. భానుప్రకాష్ అదేరోజు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేనెల 6వ తేదీన పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బాలుడు దొంగిలించిన ద్విచక్రవాహనంతో పట్టుబడగా జువెనైల్ హోమ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన నాంపల్లి 5వ ఎంసీ ఎంఎం కోర్టు న్యాయాధికారి బాలుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని, బాలుడిని జువెనైల్ హోమ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసులు మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో వాహనాలు, సినిమా థియేటర్లలో తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి తీసుకెళ్తే సీజ్ చేస్తామని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. తనిఖీల్లో ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వి.లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయసు గల వ్యక్తి మంగళవారం ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి శరీరంపై ఆకుపచ్చ రంగు ఫుల్‌షర్ట్, అదేరంగు ప్యాంటు ఉన్నాయి. అతడి ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి



కిషన్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందాడు. కాచిగూడ ఏరియాలో ఎంటమాలజీ కార్మికుడిగా పనిచేసే పెండ్యాల కిషన్(48)ను ఎన్నికల విభాగంలో పనిచేసేందుకు మంగళవారం పిలిపించారు. విధి నిర్వహణలో ఉండగా ఫిట్స్‌తో కిందపడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఫిట్స్‌తో కిషన్ పడిపోయినా.. సకాలంలో అధికారులు స్పందించకపోవడం వల్లే మరణించాడని యూనియన్ల నాయకులు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు.